క్లుప్తంగా

చిన్నారులకు భగవద్గీత శ్లోకాలు

గుడివాడ టౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో సోమవారం చిన్నారులకు భగవద్గీత శ్లోక పఠనం గావించారు. గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి అవిర్నేని వెంకటేశ్వరరావు చిన్నారులకు శ్లోకాల భావాలను వివరించారు. భగవద్గీత శ్లోకాలు కంఠత చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు పి. శాంతి, వి. సునీత తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



పామర్రు: స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద అంబేడ్కర్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ చొరవతో ఎంపీ వల్లభనేని బాలశౌరి రూ. 30లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో అంబేడ్కర్ భవన నిర్మాణ కమిటీ సభ్యులు సోమవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ల ఫొటోలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాణ కమిటీ సభ్యులు చిన్నం శ్రీనివాసరావు, గంధ్రపు సీనయ్య, పెయ్యల రాజు, మద్దుల సుబ్రమణ్యం, ఎస్సీ న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఆవుల ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కల సీఐగా చలపతిరావు



పమిడిముక్కల: పమిడిముక్కల సీఐగా ఎస్. చలపతిరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడతానని, ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సిబ్బంది పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి వితరణ

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ భీమేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి పనులకు భక్తులు రూ. 10,116లు వితరణగా ఇచ్చినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు. నందివాడ మండలం జనార్దనపురం గ్రామానికి చెందిన యూఎస్ఆర్ ఆక్వా ఫీడ్స్ అధినేత కొండపల్లి ఉమాశంకరరెడ్డి ఆలయ అభివృద్ధి పనులకు, రాజగోపురం నిర్మాణానికి వినియోగించుకోవాలని ఈ మొత్తాలను ఇచ్చినట్లు తెలిపారు. ఉమాశంకర రెడ్డిని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చందరాల హరిరాంబాబు, కమిటీ సభ్యులు అభినందించారు.

సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమలకు చేయూత

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ పథకం ద్వారా సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోందని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో సోమవారం సాయంత్రం సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమల పురోభివృద్ధిపై తీసుకోవాల్సిన చర్యల గురించి కమిటీ సభ్యులతో జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు గరిష్టంగా కోటి రూపాయల వరకు రుణం, ప్రాజెక్టు వ్యయంలో 30 శాతం వరకు రాయితీ ఇస్తారన్నారు. ప్రాజెక్టు వ్యయంలో 10 శాతం బెనిఫిషరీ పెట్టుబడి పెట్టాలన్నారు. ప్రస్తుతం వ్యాపారంలో కొనసాగుతున్న అన్ని సూక్ష్మ పరిశ్రమల వారు దీనికి అర్హులన్నారు. ఔత్సాహికులైన యువతీ, యువకులు, డ్వాక్రా మహిళలు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. సమావేశంలో ఏపీఎఫ్‌పీఎస్ ఈడీ మహాలక్ష్మి, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం.వి జయభారతి పాల్గొన్నారు.

పేదలకు చంద్రబాబు క్షమాపణ చెప్పాల్సిందే



నిరసన ర్యాలీలో పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్న పామర్రు శాసన సభ్యుడు కైలే అనిల్‌కుమార్



కైకలూరులో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

- ఎమ్మెల్యేలు కైలే అనిల్‌కుమార్, డీఎన్నార్ డిమాండ్
- పామర్రు, కైకలూరుల్లో నిరసన ర్యాలీలు

పామర్రు: పేదల ఇళ్ల స్థలాలు శవాలను పూడ్చటానికి ఉపయోగపడతాయని చంద్రబాబు అనటం దారుణమని పామర్రు నియోజకవర్గ శాసన సభ్యుడు కైలే అనిల్‌కుమార్ అన్నారు. చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా స్థానిక పార్టీ కార్యాలయం నుంచి కురుమద్దాలి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పేద బడుగు వర్గాలకు ఇచ్చిన భూమి, శవాన్ని పూడ్చటానికి కూడా సరిపోదంటూ చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని పేదలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు చేసిన అప్రజాస్వామిక, అహంకారపూరిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని వీటిని వెంటనే ఉపసంహరించాలని అన్నారు. చంద్రబాబుకు ఎస్సీ, ఎస్టీ, బీసీలు అంటే చాలా చులకనభావం ఉందన్నారు. గతంలో ఆయన సీఎంగా ఉన్న సమయంలో హక్కుల కోసం బలహీనవర్గాల వారు కలిస్తే తోకలు కట్ చేస్తానని అన్నారని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 31లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని అన్నారు. చిత్త శుద్ధితో జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తున్నారని వివరించారు.

ఓర్వలేకే విమర్శలు..

పేదలు, మహిళలు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎదుగుతుంటే చూసి ఓర్వలేని చంద్రబాబు ఇటువంటి దుర్బుద్ధి రాజకీయాలకు తెర తీస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల సంగ్రామంలో పేదలకు అహంకారవాదులకు మధ్య యుద్ధంగా మారనుందని అన్నారు. ఈ యుద్ధంలో పేద వర్గాల వారు విజయం సాధించడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సమాధులు కావవి.. పేదల బతుకులు..

కైకలూరు: పేదలకు దేవుడిలా ఇంటి స్థలాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తుంటే చంద్రబాబు నాయుడు సెంటు స్థలం పేదల సమాధులకే సరిపోదని హేళన చేయడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ విమర్శించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ ఆధ్వర్యంలో చంద్రబాబు మాటలను ఖండిస్తూ నియోజకవర్గ స్థాయిలో భారీ బైక్ ర్యాలీని కైకలూరులో సోమవారం నిర్వహించారు. సంతమార్కెట్ వద్ద వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలో 17,000 ఎకరాల్లో స్థలాలను పేదలకు పంపిణీ చేశామన్నారు. దమ్ముంటే ప్రతిపక్ష నాయకులు చర్చకు రావాలని సవాల్ విసిరారు. అమరావతి వద్ద 51,000 మందికి పట్టాలు అందిస్తుంటే కడుపుమంటతో చంద్రబాబు చవకబారు విమర్శలు చేస్తున్నారన్నారు. త్వరలో పార్టీ జోనల్ ఇన్‌చార్జి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ జయమంగళ మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాల్లో రాష్ట్ర స్థాయిలో ఎమ్మెల్యే డీఎన్నార్ ముందు వరుసలో నిలిచారన్నారు. కార్యక్రమంలో కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి ఎంపీపీలు అడివి కృష్ణ, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు బలే నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఛత్రాజు శివాజీ, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, నాయకులు చేబోయిన వీర్రాజు, పంజా రామారావు, తలారి జాన్, బొబ్బిలి రత్తయ్యనాయుడు, పాము రవికుమార్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పక్కా ఏర్పాట్లు



పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: పట్టణంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టిడ్కో లే-అవుట్ అభివృద్ధి పనులు చివరి దశకు చేరాయని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి సోమవారం లే-అవుట్‌లో మౌలిక వసతులు, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పనుల పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మందపాడు రైల్వే ట్రాక్ కింద నుంచి లే-అవుట్‌కు తాగునీరు పైప్‌లైన్ ఏర్పాటుకు రైల్వే అనుమతి లభించడం, నేడు ఇంటర్ కనెక్షన్‌లు పూర్తవడం పట్ల ఆయన అభినందనలు తెలిపారు. సమీపంలోని కాలువ గట్టుపై రెండు ప్రత్యామ్నాయ వంతెనలు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మోడల్ టౌన్‌షిప్ మాదిరిగా టిడ్కో లే-అవుట్‌ను అభివృద్ధి చేయడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలడుగు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లకు అవార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్



గుడివాడలో వలంటీర్‌ను సత్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

కురుమద్దాలి(పామర్రు): వలంటీర్ల సేవలు అభినందనీయమని పామర్రు శాసన సభ్యుడు కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండల పరిధి కురుమద్దాలి గ్రామంలోని కల్యాణ మండపంలో మండల పరిధి కురుమద్దాలి, పెదమద్దాలి, కొమరవోలు, జమీగొల్వేపల్లి, అడ్డాడ, కనుమూరు సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు సమావేశం సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి పల్లె ప్రజల ముంగిటకే సర్కారు సేవలను తీసుకువచ్చారన్నారు.

నియోజకవర్గంలో ఇలా..

పామర్రు నియోజకవర్గంలో 1369 మంది వలంటీర్ల ఉండగా వీరిలో 1,141 మందికి ఈ అవార్డులు దక్కాయని ఎమ్మెల్యే చెప్పారు. వీరిలో 1111 మందికి సేవా మిత్ర, 25 మందికి సేవా రత్న, 5 మందికి సేవా వజ్ర అవార్డులు లభించాయన్నారు. అవార్డు గ్రహీతలను సత్కరించి ప్రశంస పత్రాలను అందజేశారు. గ్రామ సర్పంచ్ గోత్రు విజయభారతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ డి. అశోక్‌కుమార్, జెడ్పీటీసీ కె. స్వరూపరాణి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, కో ఆప్షన్‌సభ్యుడు ఎండీ హస్మతుల్లా, ఎంపీటీసీ టి. శ్రీనివాసరావు ఎంపీడీవో వై. రామకృష్ణ పాల్గొన్నారు.

సేవలు నిరుపమానం..

గుడివాడ టౌన్: ప్రభుత్వ పథకాలు ప్రజలకు నేరుగా చేరవేయడంలో వలంటీర్లు చూపుతున్న శ్రద్ధ వారి సేవలకు నిదర్శనమని మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణ అన్నారు. స్థానిక మాంటిస్సోరీ తెలుగు మీడియం హైస్కూల్‌లో సోమవారం వార్డు వలంటీర్ల సత్కార కార్యక్రమం నిర్వహించారు. 1, 2, 3, 4, 5, 36 వార్డుల ఉత్తమ సేవా పురస్కారాలు పొందిన వలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మండలి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వీరిశెట్టి నరసింహరావు, అసిలేటి అర్జునరావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి



జమీగొల్వేపల్లిలో విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఉషాదేవి

జమీగొల్వేపల్లి(పామర్రు): విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకుంటే భవిష్యత్‌లో మంచి ఉద్యోగాలను పొందవచ్చని మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషా దేవి అన్నారు. మండల పరిధి జమీగొల్వేపల్లి గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా సోమవారం విద్యార్థులకు పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి. నాగ సురేష్ పాల్గొన్నారు. అలాగే పామర్రులోని శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు రన్నింగ్ రేస్, గేమ్స్ తదుపరి సామూహిక పఠనా కార్యక్రమం నిర్వహించామని గ్రంథాలయ అధికారి ఎం. రూప్సీరాజ్ తెలిపారు.

జ్ఞాపకశక్తిని పెంచే గేమ్స్ ఆడాలి

మండవల్లి: చెస్, చైనీస్ చెక్కర్, క్యారమ్‌బోర్డ్ గేమ్స్ ఆడటం వల్ల విద్యార్థుల జ్ఞాపక శక్తి పెరుగుతుందని ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి ఎల్ఎస్ భాస్కరరావు, గ్రంథాలయాధికారి షేక్‌పర్వీన పేర్కొన్నారు. జీవితంలో అవసరమైన నిర్ణయాలు తీసుకోగలుగుతారని తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో 22వ రోజు సోమవారం వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు చెస్, చైనీస్ చెక్కర్, క్యారమ్‌బోర్డు గేమ్స్ ఆడించారు. ఆటలాడే విధానం, మెలకువలను నేర్పారు. క్యారమ్ బోర్డ్ గేమ్ ఆటగాళ్లను మెరుగైన వ్యక్తులుగా మార్చడంలో సహాయపడుతుందని గ్రంథాలయాధికారి షేక్ పర్వీన చెప్పారు. లైబ్రరీ సైన్స్ విద్యార్థిని మాతంగి సుష్మాసరోజ, బేతపూడి కుసుమ, సాంసన్ తదితరులు పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న వెలమ సంఘం నాయకులు

గుడివాడ టౌన్: గుడివాడ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 15వ రోజు మజ్జిగ పంపిణీ కార్యక్రమం కొనసాగింది. సేవా సంఘం సభ్యుల వితరణతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం వేసవి ముగిసే వరకు కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో మజ్జిగ పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్. రంగారావు, మూకల సత్యనారాయణ, రెడ్డి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

వాసవీక్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో ఏలూరు రోడ్ సహోదయ బుక్ సెంటర్ వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆదేశాల మేరకు 30 రోజుల మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం 28వ రోజు పంపిణీ కొనసాగింది. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తిరివీధి వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షులు ఎం. గంగాధరరావు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

పామర్రు: స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ కూనపరెడ్డిచంద్ర శేఖర్‌రావు సొంత నిధులతో ఏర్పాటు చేసి సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ ఈ కేంద్రం ద్వారా 200 లీటర్ల చల్లని మజ్జిగను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు తోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలకు వేళాయె!

కోడూరు: దివిసీమలో ప్రసిద్ధిగాంచిన కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలను బుధవారం నుంచి ప్రారంభించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. 31న ఉదయం 10 గంటలకు స్వామివార్లకు అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ సోమవారం చెప్పారు. సాయంత్రం 5 గంటలకు బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టి, రాత్రికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, సంతానం కోరే మహిళలకు గరుడ ప్రసాదం అందించనున్నట్లు ధర్మకర్త చెప్పారు. జూన్ 1న ఉదయం హోమాలు, శత కలశ క్షీరాభిషేకం, రాత్రికి వంతెన సెంటర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఎదురు కోలోత్సవం, 2న ఉదయం కౌతుకోత్సవము, నవకలశ స్నపన, రాత్రి స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 3న గరుడ, శేషవాహనాలపై స్వామివారి తిరువీధి ఉత్సవం, 4న అవభృదస్నానం, మహాపూర్ణాహుతి, ధ్వజావరోహణ, 5న శాంతి కల్యాణం, శ్రీపుష్పయాగం, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవతో ఉత్సవాలను ముగించనున్నట్లు పద్మావతి వరప్రసాద్ తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 6న శ్రీవారి మహా అన్నసమారాధన నిర్వహించనున్నట్లు పద్మావతి వరప్రసాద్ చెప్పారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

సంక్షేమ పథకాల అమలు జగన్‌తోనే సాధ్యం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



కురుమద్దాలిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

కురుమద్దాలి(పామర్రు): సంక్షేమ పథకాల అమలు సీఎం జగన్‌మోహన్ రెడ్డి వలనే సాధ్యం అవుతుందని.. ఇతర ఏ పార్టీల వల్ల సాధ్యం కాదని పామర్రు శాసన సభ్యుడు కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండల పరిధి కురుమద్దాలి గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని గడప గడపకు వెళ్లి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలపై ఆరా తీశారు. వాటి పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఇంటింటికీ నవరత్న పథకాల ద్వారా అందించిన లబ్ధిని వారికి తెలియజేసి సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రతీ పేద వాడు సంతోషంగా జీవించాలనే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వారి జీవన ప్రమాణాలను పెంచే విధంగా పాలన అందిస్తోందని అన్నారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ కె. స్వరూపరాణి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు తాడిశెట్టి శ్రీనివాసరావు, కొణతం వెంకటేశ్వరమ్మ, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ హస్మతుల్లా, గ్రామ సర్పంచ్ జి విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆక్వా రైతుల కీలక సమావేశం

కైకలూరు: ఆక్వా రైతుల సమస్యలపై కైకలూరు సీఎన్నార్ గార్డెన్‌లో మంగళవారం సాయంత్రం మూడు గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేపల రైతుల అసోసియేషన్ సభ్యులు తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఆక్వా రంగంలో ఎదురవుతోన్న సమస్యలపై చర్చిస్తారని తెలిపారు. నివేదిక రూపంలో ప్రభుత్వానికి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అందిస్తామని పేర్కొన్నారు. ఆక్వా రైతులు తప్పక హాజరుకావాలని కోరారు.